అప్పుడు మా నాన్న కఠోరమైన శారీరక శ్రమ చేసి, నాలుగు ఎకరాల భూమి కొన్నాడు. కాటన్ దొర మానవత్వపు వెలుగుల్లోంచి వచ్చిన నీటి కాలువలు ఈ భూమిని బంగారం పండే ప్రాంతంగా మార్చివేశాయి. మా నాన్న అప్పుడు ఎకరం రెండొందల రూపాయలకే కొన్నాడు. ఆ ఎకరం నేను ఎదగాలనుకున్నప్పుడు పదివేలయింది. నాలుగు ఎకరాలు నలభై వేలు! అదే నా జీవిత పరమ పదానికి మెట్లయి నన్ను పైకి తీసుకెళ్ళాయి. ఆయన- మా నాన్న కాదు, దైవానికి ప్రతి రూపం. తను వ్యవసాయ కూలీ అయినా, నేనూ అలాగే కాకూడదని కడుపు కట్టుకొని ఆ నాలుగెకరాలు కొన్నారు.

ఆయనే చనిపోతూ తనను తన ఒళ్ళో కూర్చోబెట్టుకొని తల నిమురుతూ నీకు నేను బిడ్డనై పుడతాను. నన్ను మరో జన్మలో కూడా కష్టపెట్టకు నాన్నా అని అడిగినప్పుడు నా గుండె ద్రవించి అనంత దిగంతాలకు వ్యాపించింది.

అదిగో అలాంటి నమ్మకాలనుంచి, సెంటిమెంట్ల నుంచి ఎదిగిన నేను, నా కొడుకు బాధపడితే ఎలా చూడగలను? చూడలేను.

అందుకే చూసేవారికి నా ప్రేమ పిచ్చిగా, వెర్రిగా, తిక్కగా అనిపించినా లెక్కచేయకూడదు కదా? అసలు నా బిడ్డ మధుకర్ మొఖంలో నీడల్ని నేను చూడలేను. వాటిని తొలగించటానికి ఈవెన్ ఐ కెన్ స్టేక్ మై హోల్ ప్రాపర్టీ--

పిచ్చో, మూర్ఖత్వమో, అంధత్వమో ఏమీ తెలిదు. అయినా రాఘవేంద్ర నాయుడు లెక్కచేయడు.

ఢిల్లీ నేషనల్ టెర్మినల్‌లోకి ఎంటరవుతూ ఇరవై లక్షలు నష్టం వచ్చినా, ఆ బార్‌ని కొన్నప్పుడు నా తండ్రి కళ్ళల్లో ఎంత ఆనందం తొంగి చూసిందో? వెధవ జపాన్ ట్రిప్ లేకుంటే ఆ ఆనందాన్ని ప్రత్యక్షంగా చూడగలిగేవాడ్నే కదా! అని అనుకున్నాడు ఒకసారి.

ఫ్లైట్ టేకాఫ్ అయింది.

*   *   *   *

మహతి హైదారాబాద్‌లో దిగింది.

టాక్సీలో  ఇంటికి బయలుదేరింది.

ఆమె వస్తున్నట్లు రాజేంద్ర ప్రసాద్‌కు కూడా తెలీదు. తను ఒక వెంచర్‌లో సక్సెస్ అయిన సంఘటన తాలూకు ఆనందం ఆమెను వివశురాల్ని చేస్తోంది.

కానామెకు తెలీదు-తను ఎవరినయితే ఫూల్‌ని చేసిందో - అతని వెనుక మేధావి అయిన వ్యాపారి ఉన్నట్లు, ఆయన అలాంటి నష్టాల నెన్నింటినో చూసి ఉన్నాడని మహతికి తెలీదు.

కొన్ని విషయాలు అలా తెలీకుండా ఉండబట్టే జీవితాలు, సంఘటనలు నాటకీయతను జోడించుకొని కొత్త మలుపులకి హేతువులవుతాయని తెలియటానికి ఆమె కెంత వయస్సుందని?

*                    *                    *                    *

"వేరొకరికి కాకుండా వుండాలంటే అదొక్కటే మార్గం--" అన్నాడు మూర్తి.

ఇతరులు క్షోభపడుతుంటే, జీవితాల్ని ఫణంగా పెట్టుకుంటే చూసి ఆనందించే మూర్తి, ఆ రోజు  ఉదయమే మధుకర్ బెడ్‌రూమ్‌లో చేరి రెచ్చగొట్టటం ఆరంభించాడు.

మధుకర్‌కి ఎందుకో ఆ పని చేయాలని అనిపించటం లేదు.

"రేప్ చేసి స్వంతం చేసుకోవటం అమానుషం కదా?"

మధుకర్ అమాయకంగా పశ్నిస్తుంటే మూర్తి లోలోనే నవ్వుకున్నాడు.

"పిచ్చివాడా! ఎవ్విరీథింగ్ ఇన్ దిస్ వరల్డ్ ఈజ్ ఏ ట్రాన్సాక్షన్ ! ఇట్స్ ఆల్ ఇన్ ది గేమ్! నీకేం తక్కువయిందని నిన్ను కాదంది? అందమా? చదువా? ఆరోగ్యమా? ఆస్తినా? సోషల్ స్టేటసా? ఏది తక్కువని? నీకేదీ తక్కువ కాదు. తనకి పొగరెక్కువ గనుక మరా పొగరుని దించేస్తే ఒక పనయినట్లుంటుంది. ఇప్పటివరకు ఆమె వర్జిన్ ఆమె పొగరు. ఆమె వర్జినిటీతో ముడిపడి వుంది. దాన్ని దించేశావనుకో--

అసలు నీకో విషయం తెలుసా?

స్టేట్స్‌లో టెక్సాస్ బిలియనీర్స్ సూత్రమేమిటో తెలుసా? నీకు నచ్చినమ్మాయిని స్క్రూ చేసి వదిలేయ్! నో ప్రాబ్లమ్! డబ్బు వెదజల్లు! నో ప్రాబ్లమ్! ఐట్ డోంట్ డెవలప్ ఎటాచ్‌మెంట్స్ అని వాళ్ళు వయసొచ్చిన వాళ్ళ పిల్లలకు చెబుతారట! ప్యూర్ ప్రొఫెషనల్ బిజీమెన్ ఆలోచనా సరళే అలా వుంటుంది. ఉండాలి. డోంట్ హెజిటేట్ టు లిక్విడేట్ హర్ వర్జినిటీ! పథకం సిద్ధం చేశాను. ఎవరూ లేని ఒంటరి ప్రపంచానికి ఆమె వచ్చేలా చేస్తాను. అహం జ్వరం ఆమె అద్భుతమైన, అందమైన దేహాన్ని దహించి వేస్తోంది. మరి నువ్వొక వైద్యుడిలా మారాలి గదా?" మూర్తి పొయ్యిని మరింత రాజేస్తున్నాడు.

స్వతహాగానో, జన్మతహా: వచ్చిన సంస్కారమో తెలీదు. మూర్తి ప్రపోజల్‌కి మధుకర్  మనస్సు పూర్తిగా అంగీకరించడంలేదు.

వైట్ పర్సనాలిటీ ..... మంచి పనులే చేయాలి - నలుగురితో మంచనిపించుకొమ్మని ఉత్తేజ పరుస్తోంది.

బ్లాక్ పర్సనాలిటీ ..... చెడ్డపనులు చేసి- కసి, పగ తీర్చుకోమంటుంది- ఇతరుల్ని హింసించి శాంతపడమంటుంది.

మల్టిపుల్ పర్సనాలిటీ ..... అందరూ చూస్తుండగా మంచి చేసి- చూడనప్పుడు చెడు చేసి రెండు రకాలుగా శాంతిస్తుంది. ప్రపంచంలో ఏ వ్యక్తిలోనైనా ఈ మూడు రకాల పర్సనాలిటీలే ఉంటాయి.

మూర్తిది మల్టిపుల్ పర్సనాలిటీ అయితే, మధుకర్ ది వైట్ పర్సనాలిటీ.

మొగల పొదల వెనుకదాగి ఉండే మిన్నాగులాంటివాడు మూర్తి.

ఎంతసేపని మిన్నాగు ప్రభావానికి లోను కాకుండా ఉంటాడు మధుకర్ . అతని ప్రేరణ మొగలి రేకుల సుగంధాన్ని వెదజల్లుతుంటే ఆఘ్రాణించకుండా ఉండగలడా?

“నాకెందుకోరా? అలా చేయాలంటే మనస్సంగీకరించటం లేదు. నేనేం చేసినా మా నాన్నగారు బాధపడరు, పట్టించుకోరు- అలా అని ఒకమ్మాయిని మానభంగం చేయటం ..... నాలో మా నాన్న తన నాన్నని చూసుకుంటారు. మా తాతగారు నైతిక విలువల కోసం ప్రాణాలైనా ఇచ్చేందుకు సిద్ధపడేవారట పోనీ ..... ఆ అమ్మాయిని ఏడిపిద్దామా? ఒక పని చేద్దాం ..... ” అన్నాడు మధుకర్ ఎంతో మధనపడిపోతూ .....

“ఏమిటది?” మూర్తి చటుక్కున అడిగాడు.

“మహతి నాకు తప్ప మరొకరికి దక్కకూడదు- అదే కదా ప్రధానోద్దేశం.”

“ఎస్... ఆఫ్‌కోర్స్”

“మహతి వేరే వ్యక్తిని పెళ్ళి చేసుకోకుండా చేసేస్తే!”

“నాకర్థం కాలేదు”

“వచ్చే సంబంధాలు రాకుండా అడ్డుకుంటే?”

“ఆమె ఒక అద్భుతమైన అందగత్తె- సాలార్‌జంగ్ మ్యూజియమ్‌లోని పాలరాతి విగ్రహానికి ఊపిరిపోస్తే అది మహతిగా మారింది. ఆస్తిపాస్తులున్నాయి. చూస్తూ చూస్తూ నువ్వే ముప్పైలక్షలు ఇచ్చావు. సో... ఆమె యిప్పుడు లక్షాధికారి. చదువుంది - తెలివితేటలున్నాయి. శీలం లేదని తెలిసీ డబ్బుకోసం సినిమాఆర్టిస్టుల్ని పెళ్ళి చేసుకునేందుకు లక్షల్లో యువకులు సిద్ధంగా ఉన్నారు. అలాంటప్పుడు మహతిమీద మనమెన్ని ప్రచారాలు సృష్టించినా, ఆమెని చెడు చేసినా కొన్ని వేలమందయినా యువకులు చిరునవ్వుతో, అవన్నీ తెలిసే వచ్చాం- తప్పులెవరైనా చేస్తారు. వాటిని మన్నించి మనుషులమనిపించుకోవాలి గదా అని రంగంలోకి దిగితే?”

మధుకర్ మౌనంగా ఉండిపోయాడు. అప్పటికే మూర్తి మహతిని ఒంటరిని చేసే పథకం తాలూకు పని చాపక్రింద నీరులా జరిగిపోతోంది.

ఇక్కడ మధుకర్ ఒక నిర్ణయం తీసుకోకపోయినా మహతి మీద పన్నిన వల బిగుసుకోక ఆగదు.

*                    *                    *                    *

"కేవలం మన వ్యాపారాన్ని పెంచటానికి ఆ పని చేశావో, లేక లాభం కోసం ఆ పని చేశావో నాకర్థం కావటం లేదు. ఏది ఏమైనా అది అన్యాయమని నాకనిపిస్తోంది. " రాజేంద్ర ప్రసాద్ డైనింగ్ టేబుల్ ముందు కూర్చొని టీ తీసుకుంటూ అన్నాడు.

మహతి తండ్రి వైపు చూసి చిరునవ్వు నవ్వింది.

"నీ చిరునవ్వులో సమాధానాన్ని వెతుక్కొనే శక్తి నాకు లేదు తల్లీ ..... చెప్పు, ఎందుకలా చేశావు?" రాజేంద్ర ప్రసాద్ తిరిగి ప్రశ్నించాడు.

"వ్యాపారంలో అవతలి వ్యక్తిని మోసం చేయటం తప్పు కావచ్చు- అతన్ని సర్వనాశనం చేసి మన జేబు నింపుకోవటం అన్యాయం కావచ్చు. వ్యాపారవేత్తకు లౌక్యం ఉండాలే కాని అహం కాదని- జపాన్ వ్యాపార ప్రపంచపు ప్రథమ సూత్రం. మన బార్ కొచ్చిన వ్యక్తికి మన సర్వీసు నచ్చక క్లైమ్ చేయవచ్చు. లేదా మరోసారి మన బార్‌కి రానని చెప్పవచ్చు. అంతేకాని బార్ రేటెంత అని అడగటం అహం అంచుని తాకినట్లే గదా? అదుండకూడదు. అది ఎవరికున్నా దించాల్సిందే- మనిషి మందు తాగటం తప్పో కాదో నేనయితే ఇప్పుడు ఆ మీమాంసకు వెళ్ళలేను. కానీ మందే మనిషిని తాగటం తప్పు. తాగి సవాల్ చేయటం అంత కంటే తప్పు. అలాంటి వ్యక్తి తనే మందు తాగాడో- మందే తనని తాగిందో తెలుసుకోవటం చాలా అవసరం- అందుకే అలా చేయవలసి వచ్చింది.

ఇక అన్యాయం విషయానికి వస్తే, మనిషిని పతనావస్థ అంచుకు చేర్చే మందు తయారీ- అమ్మకం తప్పు కాదా? అన్యాయం కాదా? అయినప్పుడు అది వ్యక్తి చేసినా, సంస్థ చేసినా, ప్రభుత్వం చేసినా తప్పే కదా! ఇప్పుడు తప్పు ఒప్పుల పట్టిక గురించి వ్యథ చెందటం కాదు కావల్సింది- మనం చేసేది ఎప్పుడు అన్యాయమయ్యేదంటే- ఆ ముప్పై లక్షలు నేనే తీసుకున్నప్పుడు- ఎవరు అన్యాయమయ్యేవారో తెలుసా? మన బార్‌నే నమ్ముకొని బ్రతుకుతున్న మన మేనేజర్!

జీవితం సాఫీగా సాగటంలో థ్రిల్ ఉండదు. అతలాకుతలం చేయగల అనుభూతులుండవు. కొంచెం ఓపిక పట్టండి నాన్నగారు- ఏం జరుగుతుందో- కొందరి జీవితాలు ఏ మలపు తిరుగుతాయో- మీకే తెలుస్తుంది" అంటూ టిఫిన్ బాక్స్ తీసికొని కాలేజీకి బయలుదేరింది మహతి.

ఆమె వాదనలో, ఎత్తుగడలో తనకు కనిపిస్తున్నది ఆమె తాలూకు మానసిక పరిణితో ..... జస్ట్ గేమో ఆయన కర్థం కాలేదు.

నిట్టూర్చుతూ టేబుల్ ముందు నుంచి లేచాడు రాజేంద్ర ప్రసాద్ .

*　　　　　　*　　　　　　*　　　　　　*

రాఘవేంద్ర నాయుడు స్నానం చేసి, పూజ చేసుకొని, తండ్రి ఫోటోకి ప్రణామం చేసి వచ్చి డైనింగ్ టేబిల్ ముందు కూర్చున్నాడు. ఆ హాలంతా నిశ్శబ్దంగా ఉంది. మధుకర్ అప్పటికే కాలేజీకి వెళ్ళి పోయాడు.

ఆయనక్కడకు రావటం కోసం రెండు గంటల నుండి ఎదురుచూస్తున్న ఫైనాన్స్ సెక్రటరీ వడివడిగా అక్కడకు వచ్చాడు. ఎయిర్ ఇండియా మహరాజులా వినయంగా తలవంచాడు.

"ప్లీజ్ బి సీటెడ్" అన్నాడు రాఘవేంద్ర నాయుడు ఫైనాన్షియల్ ఎక్స్ప్రెస్ని తిరగేస్తూ.

భువనేశ్వరీ దేవీ తను దగ్గరుండి చేయించిన బ్రేక్ఫాస్ట్ని భర్త ముందు అమరేలా చూసుకుంటోంది. రాత్రి ఎంతసేపు మెలకువగా ఉన్నా, ఉదయాన్నే లేవటం, మార్నింగ్ వాక్కి వెళ్ళి రావటం, స్నానం చేయటం , పూజ చేసుకోవటం, చివరలో తండ్రి ఫోటోకి ప్రణామం చేయటం- ఆ పైన వచ్చి డైనింగ్ టేబుల్ ముందు కూర్చోవటం- ఫైనాన్షియల్ ఎక్స్ప్రెస్, హిందూ, ఇండియన్ ఎక్స్ప్రెస్ లాంటి పేపర్స్ తిరగేస్తూ, ఫైనాన్స్ సెక్రటరీ చెప్పే వివరాల్ని వినటం, వింటూ బ్రేక్ ఫాస్ట్ తీసుకోవటం .....

ఆఫీసుకి బయలుదేరటం .....

తన సీట్లోకి వెళ్తూనే రొటీన్ బిజినెస్ ప్రొసీజర్స్ గురించిన సంతకాలు చేయటం-- ఆ పైన తరచూ ఉద్భవించే సమస్యలపై నిర్ణయాలు తీసుకోవటం ఆయన దినచర్యలో గతి తప్పని పని గంటలవిధానం.

"చెప్పండి" అన్నాడు రాఘవేంద్ర నాయుడు. ఒక వైపు పేపర్ చూస్తూ, మరోవైపు టిఫిన్ తీసుకుంటూ.

"నలభై గంటల క్రితం చిన్నబాబు ఒక బార్‌ని కొనేయటం జరిగింది. దానికి గాను ముప్పై లక్షలు పే చేయటం జరిగింది" అన్నాడు సెక్రటరీ పాజ్ ఇస్తూ!

అది తనకి పెద్ద విషయం కాదన్నట్లు భావరహితంగా ఉండి పోయాడు రాఘవేంద్ర నాయుడు .

కొద్ది క్షణాల నిశ్శబ్దం .....

భర్త ఎలా రియాక్టు అవుతాడని భువనేశ్వరి .....

దాన్ని తమ ఛైర్‌మెన్ లాభంగా ఎలా మార్చుతాడని ఫైనాన్స్ సెక్రటరీ ఎదురు చూస్తుండగా, క్షణాల్ని లెక్కిస్తుండగా రాఘవేంద్ర నాయుడు మెదడు చురుగ్గా పని చేయటం ప్రారంభించింది.

నష్టాల్ని లాభాలుగా .....

లాభాల్ని మరింత లాభాలుగా మార్చే పథక రచన ఇండస్ట్రియల్ ఎంపరర్ రాఘవేంద్ర నాయుడు మెదడులో క్రమంగా ఊపిరి పోసుకుంటోంది.

ఆ సమయంలో సాధారణంగా రాఘవేంద్ర నాయుడు అర్థనిమీలిత నేత్రుడయి గంభీరంగా కనిపిస్తాడు.

ఆ సమయంలో ఆయన్ని చూసిన ఎవరికైనా చిరు గగుర్పాటు కలుగుతుంది. ఒక మేధావిని- మట్టిని బంగారంగా మార్చే జీనియస్ ముందు కూర్చున్నప్పుడు అబ్బురపు ఉద్విగ్న క్షణాల్ని ఎవరైనా అనుభూతిస్తారు.

అలాంటి అనుభూతిని ఎన్నిసార్లు రుచిచూసినా, ప్రతిసారీ ఆ అనుభూతి కొత్తగానే అనిపించటం ఫైనాన్షియల్ సెక్రటరీకి కూడా అంతుపట్టని రహస్యం.

తను సి.ఏ చేసినా, ఐ.సి.డబ్ల్యు. ఏ. చేసినా, ఏ.సి. ఎస్. చేసినా - ఆ మూడు ప్రొఫెషనల్ డిగ్రీస్ ఒక వ్యక్తి సంపాదించుకో గలగటం అద్భుతమే అయినా వాటికి తోడు ఎం. కామ్., ఎం.బి.ఏ. కూడా చేసి ఏషియన్ ఎకనామిక్ ట్రెండ్ అనే సబ్జెక్టు మీద రీసర్చ్ చేసి పి.హెచ్. డి. తెచ్చుకున్న ఫైనాన్షియల్ సెక్రటరీకి రాఘవేంద్ర నాయుడు తెలివితేటలు అద్భుతంగా అనిపిస్తాయి.

మొట్టమొదటిసారి తను రాఘవేంద్ర నాయుడును కలిసేందుకు అపాయింట్‌మెంట్ తీసుకునే సందర్భంలో తన విజిటింగ్ కార్డ్‌ని ఆయన పి.ఏ. కి ఇస్తూ, చూశావా నాకెన్ని డిగ్రీలున్నాయో అని అతనికేసి ఒక సారి గర్వంగా చూసినప్పుడు- ఆ పి.ఏ. కళ్ళద్వారానైనా అభినందించకపోవటం, అడ్మిరేషన్‌గా చూడకపోవటం ఒకింత కోపాన్ని తెప్పించింది.

డాక్టర్ పి. రవికిరణ్, ఎం.కామ్., ఎమ్.ఫిల్., ఐ.సి. డబ్ల్యూ. ఏ., సి.ఏ., ఏ.సి.ఎస్, పి.హెచ్.డి. అని గోల్డెన్ లెటర్స్‌తో విజిటింగ్ కార్డ్ ప్రింట్ చేయించుకున్నప్పుడు తనకు తానుగా తానో మేధావినని ఫీలయ్యాడు.

తనకు రాఘవేంద్ర నాయుడి విజిటింగ్ కార్డ్ అతని పి. ఏ. అందించినప్పుడు అతనెందుకలా చేశాడో తన కర్థంకాక ఒకరకమైన అలకని కూడా తను ఫీలయ్యాడు.

ఆ విజిటింగ్ కార్డ్ అతి సాధారణంగా ఉంది. దానిమీద జస్ట్ రాఘవేంద్ర నాయుడు, ఛైర్మెన్ అనే అక్షల క్రింద ఆయన ఫర్మ్స్ పేర్లున్నప్పుడు తనకు రాఘవేంద్ర నాయుడు మీద పెద్ద గొప్ప అభిప్రాయం కలగలేదు. ఒక వ్యక్తి తెలివితేటల్ని, మేధస్సుని, వ్యాపార దక్షతని, సమయస్ఫూర్తిని - జస్ట్ బట్టీపడితే వచ్చే ఎకడమిక్ క్వాలిఫికేషన్స్ సంపాదించిపెట్టలేవేమో అన్న న్యూనతా భావం తను ఉద్యోగంలో చేరిన మొదటి నెల అనుభవంలో అనిపించటం-- రిసర్చ్ చేయటానికి అభ్యర్థుల్ని ఎన్నిక చేసేందుకు యు.జి.సి. యూనివర్శిటీల ద్వారా ప్రవేశపెట్టిన ఎమ్. ఫిల్. అనే ప్రీ-క్వాలిఫైయింగ్ ఎగ్జామినేషన్ కేపిటల్ లెటర్స్‌ని కూడా డిగ్రీలా భావించిన మందభాగ్యుడు తను-- అని అనిపించటం మరీ అసహ్యామనిపించింది.

ఎమ్‌సెట్ ఎగ్జామ్ రాయంటే ఇంజనీరింగ్‌లో సీటు రాదని తెలిసి కూడా, ఇంజనీరింగ్ అయ్యాక ఎమ్.సెట్., బి.ఇ. అని పెట్టుకొనే వారిని చూసి జాలిపడటం తప్ప ఏం చేయలేం అని, రాఘవేంద్ర నాయుడు ఎంపైర్‌లో కొందరు అన్నప్పుడు తను ఇంటికి వచ్చి లెటర్ హెడ్స్‌ని, విజిటింగ్ కార్డ్స్‌ని తగలబెట్టాడు.

అలా తగలబెట్టే ముందు ఒక అర్థంలేని వాదనకూడా తను చేశాడు-- ఉస్మానియా ఎమ్.ఫిల్‌కి ప్రత్యేకమైన గుర్తింపు వుంది-- దాన్ని అక్కడ డిగ్రీగా భావిస్తారని అన్నప్పుడు, ముప్పైయ్యేళ్ళుగా ఏ క్వాలిఫికేషన్ లేకుండా ఎకౌంటెంట్‌గా చేస్తున్న ఓ నడివయస్కుడు తనను చూసి జాలిపడుతూ-- ఉస్మానియా ఎమ్.ఫిల్‌కి ఒక గుర్తింపు ఆంధ్రా యూనివర్శిటీ ఎమ్.ఫిల్‌కి గుర్తింపు లేకపోవటం వుండదు. యు.జి.సి. నిర్దేశించిన ఎమ్.ఫిల్ ఎక్కడైనా ఒకటే-ఒకలానే చూస్తారన్నప్పుడు తలను నేలకేసి కొట్టుకోవాలనిపించింది.

అప్పుడు మరికొన్ని నగ్న సత్యాలు కూడా తెలిశాయి.

జె.ఆర్. డి.కి, లీయోకోకాకి, సాయ్ చిరోహోండాకి, ఆగ్నెల్లీకి తనకున్న క్వాలిఫికేషన్స్ లేకపోయినా- నిజజీవితపు వ్యాపార పరమపద సోపాన పటంపై నష్టాల పాముకాటుని తప్పించుకుంటూ లక్ష్యాన్ని చేరుకున్నారని తెలిసినప్పుడు తను సిగ్గుతో చితికిపోయాడు.